

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పాలి

- కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

చిన్నంబావి, మే 7: తండ్రి బీఆర్ఎస్ ఎంపీ.. తనయుడేమో బీజేపీ ఎంపీ అభ్యర్థి.. ఇద్దరు కలిసి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలను మోసం చేసేందుకు బయలుదేరారని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దదగడ, గడ్డబస్వాపూర్, గూడెం, బెక్కెం, మియాపూర్, వెల్లగొండ, అమ్మాయిపల్లి, దగడపల్లిలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. పోతుగంటి రాములు ప్రస్తుతం బీఆర్ఎస్ ఎంపీ, తనయుడేమో బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడని, ఎంపీగా ఉండి నాగర్‌కర్నూల్ ప్రాంతాన్ని ఆగమాగం చేసింది చాలక, తనయుడితో మరింత నాశనం చేసేందుకు ఇద్దరూ కలిసి బయల్దేరారని ఎద్దేవా చేశారు. ఇలాంటి వ్యక్తులకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లు తీసేయాలని చూస్తుందని.. కాంగ్రెస్ ప్రభుత్వం గెలిస్తే రిజర్వేషన్లు పెంచుతామన్నారు. గతంలో యూపీఏ ప్రభుత్వంలో రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1200 చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదన్నారు. ఎన్నికల కోడ్ తర్వాత జూన్ 3నుంచి ఉచిత కరెంట్ పథకం ప్రారంభమవుతుందన్నారు. గ్యారెంటీల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, కొత్త కల్యాణ్‌కుమార్, కృష్ణప్రసాద్, బీచుపల్లి, మహదేవన్ గౌడ్, బాలు, రంజిత్‌కుమార్, తేజరెడ్డి, సురేంద్రసింగ్, సుధాకర్, అంజి, జ్యోతి గౌడ్, నాగరాజు, ప్రభుకిరణ్, శ్రీను, బాలకృష్ణ, యుగంధర్, శంకర్, కల్వరాల వెంకటేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆగస్టునాటికి రూ.2లక్షల రుణమాఫీ ఖాయం

- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఖిల్లాఘణపురం, మే 7: ఆగస్టు 15వ తేదీలోగా రూ.2లక్షల రైతు రుణమాఫీ ఖాయమని.. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అల్లమాయిపల్లిలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గానికి ఇప్పటికే 3,500 ఇండ్లు మంజూరయ్యాయని, ఎంపీ ఎన్నికలయ్యాక ప్రతి పల్లెలో గ్రామసభలు నిర్వహించి ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమం చేపడుతామన్నారు. ఎంపీ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి డాక్టర్ మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి, వెంకట్రావు, నాయకులు లక్ష్మారెడ్డి, విజయ్‌కుమార్, ప్రకాశ్, రవికుమార్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జయకర్, నరేందర్‌రెడ్డి ఉన్నారు.

## శాంతినగర్‌లో బర్రెలక్క ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బర్రెలక్క

వడ్డేపల్లి, మే 7 : నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కర్నె శిరీష (బర్రెలక్క) మంగళవారం సాయంత్రం శాంతినగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ధైర్యంగా ప్రజాసేవ చేయడానికి ముందుకు వచ్చానని తనను ఆదరించాలని ఓటర్లను అభ్యర్థించారు. తనను గెలిపిస్తే ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమల స్థాపన, నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇప్పిస్తామని హామీ ఇచ్చింది. యూట్యూబ్‌లో ఫేమస్ అయిన బర్రెలక్కను చూడటానికి ప్రజలు ఆసక్తి కనబర్చారు.

## రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపు

పాన్‌గల్, మే 7: మండలంలోని వివిధ గ్రామాల్లో ఈదురు గాలుల వల్ల రోడ్డుకు ఇరువైపులా వాలిన చెట్లతో ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో మంగళవారం ఎస్సై వేణు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అడ్డంగా వాలిన చెట్లు, కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రంతోపాటు కొత్తపేట, అన్నారం, దవాజీపల్లి, వెంగళాయిపల్లి, కేతేపల్లి తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి వీచిన బలమైన గాలులతో చెట్లు విరగడం, కొమ్మలు రోడ్డుకు అడ్డంగా వాలినట్లు తెలిపారు.

### గుర్తు తెలియని శవం లభ్యం

వనపర్తి టౌన్, మే 7: జిల్లా కేంద్రంలో మంగళవారం గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్సై జయన్న తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ప్రభుత్వ ఏరియా దవాఖానలో గుర్తు తెలియని శవం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారన్నారు. చనిపోయిన వ్యక్తి 40ఏండ్ల వయస్సు ఉంటుందని కుడి చేతిపై ఆంజనేయుడి బొమ్మ ఉందని, చేతికి కడెం ఉన్నదని తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని చెప్పారు.

### విద్యుదాఘాతంతో గేదె మృతి

పాన్‌గల్, మే 7: మండలంలోని చింతకుంటలో సంగనమోని కృష్ణయ్యకు చెందిన గేదె మంగళవారం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ తీగ తెగిపడి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. బాధితుడి కథనం ప్రకారం.. తనకున్న గేదెలను వ్యవసాయ పొలంలో మేత మేపుతుండగా మంగళవారం వీచిన ఈదురుగాలులకు విద్యుత్ వైరు తెగి ప్రమాదవశాత్తు గేదెపై పడి విద్యుదాఘాతానికి గురైంది. గేదె విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని తెలిపారు.

### పేకాట స్థావరంపై దాడి

కొత్తకోట, మే 7: మండలంలోని సంకిరెడ్డిపల్లి శివారులో మంగళవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.17,400 నగదు, మూడు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు పారిపోయినట్లు తెలిపారు. వారిని కూడా త్వరలో పట్టుకొని కేసు నమోదు చేస్తామన్నారు.

### షార్ట్ సర్క్యూట్‌తో రూ.50వేలు దగ్ధం

ఉండవెల్లి, మే 7 : షార్ట్‌సర్క్యూట్‌తో రూ.50వేల నగదు దగ్ధమైన ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం కంచుపాడు గ్రామానికి చెందిన సలీం సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ తో రూ.50వేల నగదు, టీవీ, కూలర్, ఫ్యాన్ బ్రిడ్‌కు కొన్న కొత్తబట్టలు దగ్ధమయ్యాయన్నారు.

### ఈదురు గాలులతో వర్షం


ఉండవెల్లి, మే 7 : మండలంలోని వివిధ గ్రామాల్లో సాయంత్రం 7గంటల నుంచి భారీగా ఈదురు గాలులు వీస్తూ వర్షం కురిసింది. ఈదురు గాలులకు విద్యుత్ శాఖ అధికారులు సరఫరాను నిలిపివేయడంతో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

### విద్యార్థికి సన్మానం

వనపర్తి టౌన్, మే 7: జాతీయ స్థాయిలో యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమనరీ శిక్షణకు వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి గణేశ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థిని కళాశాల యాజమాన్యంపూల బొకేతో సన్మానించి అభినందించారు. విద్యార్థిని అభినందించినవారిలో అధ్యాపక బృందం ధాంసింగ్, రఘునందన్, ఉమా, వెంకటస్వామి, రవికుమార్, నాగలక్ష్మి, సునీత, కురుమూర్తి ఉన్నారు.

# కాంగ్రెస్ రాకతోనే కష్టాలు మొదలు

- బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్
- ముమ్మరంగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారం



జిల్లా కేంద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్



ఖిల్లాఘణపురం మండలంలో కూలీలతో మాట్లాడుతున్న ప్రత్యూష, బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి, మే 7: రాష్ట్రంలో కాంగ్రెస్ వచ్చుడుతోనే ప్రజలకు కష్టాలు మొదలైనవని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని అయిజనగర్, సాయినగర్ కాలనీ, రాజీవ్ గృహకల్పలో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేండ్లలో కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారన్నారు. ఎడారిలాంటి తెలంగాణను సాగునీళ్లు అందించి అన్నపూర్ణగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రాష్ట్రానికే తలమానికంగా అభివృద్ధి చేశారన్నారు. వలసల ప్రాంతానికే వలసలు వచ్చేలా సాగునీళ్లు పారించిన ఘనత నిరంజనుడికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ప్రకాశ్‌రాజ్, రమణ, నాగరాజు, బాలపీరు, అరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్‌ది సంక్షేమం.. కాంగ్రెస్‌ది క్షామం

: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ ప్రత్యూష

ఖిల్లాఘణపురం, మే 7: పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో సంక్షేమం ఉండేదని.. కాంగ్రెస్ పార్టీది క్షామమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కూతురు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ ప్రత్యూష అన్నారు. మంగళవారం మండలంలోని సల్కలాపూర్, మామిడిమాడ, పర్వతాపూర్‌లో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా సమన్వయకర్త నందిమల్ల అశోక్, పురేందర్‌రెడ్డి, మండల నాయకులతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ వచ్చాక రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కనుమరుగయ్యాయని, అబద్ధాల కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పి కేసీఆర్ ఆశీర్వదించి పంపిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అదేవిధంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నిర్మలాసుదర్శన్, రంగారెడ్డి, మల్లారెడ్డి, జనార్దన్, అమరేందర్, శరత్, సురేందర్, రవి, వెంకటస్వామి, బుచ్చిరెడ్డి, శ్వేత, శివప్రసాద్, కార్యకర్తలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌తోనే తెలంగాణ సుభిక్షం

అయిజ, మే 7 : కొట్లాది సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని గులాబీ శ్రేణులు వివరిస్తున్నారు. మంగళవారం అయిజ మున్సిపాలిటీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తరపున ప్రచారం నిర్వహించారు. విద్యావంతుడు, సబ్బండ వర్గాలకు అండగా నిలుస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను పార్లమెంట్‌కు పంపితే నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తాడని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీస్సులతో, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు సహకారంతో అలంపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అండగా ఉంటారని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆర్ఎస్పీకి భారీ మెజార్టీ ఇద్దాం

రాజోళి, మే 7: పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాజోళి మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని మాన్‌దొడ్డి గ్రామంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు ఆదేశాల మేరకు మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ పాలనలో వస్తున్న కష్టాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మాన్‌దొడ్డి గ్రామ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

### మంచి చేసిన పార్టీని మరువకండి

వడ్డేపల్లి, మే 7 : బీఆర్ఎస్ పార్టీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని, అలాంటి పార్టీ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మంగళవారం నాయకులు రవిచందర్ శేఖర్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, భీమేశ్‌గౌడ్ జూలేకల్, కొంకల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలను ఆదుకున్న బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి కార్యకర్త నడుం బిగించాలన్నారు.

### జోరుగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

అలంపూర్, మే 7 : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ గడువు దగ్గర పడుతుండటంతో ప్రచారం జోరందుకున్నది. బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపుకోసం అలంపూర్ పట్టణం ,మండలాల్లో కార్యకర్తలు, నాయకులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంచి పెడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.

### ఉండవెల్లి మండలంలో..

ఉండవెల్లి, మే 7 : మండలంలోని మారమునగాల గ్రామంలో బీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు బాలరాజు ఆధ్వర్యంలో మంగళవారం జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి కారుగుర్తుకు ఓటేసి ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఆలయ కమిటీ చైర్మన్ రవిప్రకాశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ శివనారాయణ, ఎంపీటీసీ కురుమూర్తి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లికార్జున్, వెంకట్రామన్‌గౌడ్, రాంబాబు, కుర్మన్న పాల్గొన్నారు.

### ఇంటింటి ప్రచారం

అయిజ రూరల్ , మే 7 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు పార్టీ తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని సంకాపురం, వెంకటాపురం, కిష్టాపురం గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్సింగ్ రావు, వేణుగోపాల్ రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

### మల్దకల్ మండలంలో..

మల్దకల్, మే 7: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని అమరవాయిలో బీఆర్ఎస్ నాయకులు ఎంపీటీసీ పెద్దగోపాల్ రెడ్డి, సీనియర్ నాయకుడు తూంకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పథకాలను ఇంటింటికీ తిరిగి వివరించారు. ఈ సారి పార్టీ అభ్యర్థికే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, మహేశ్, తిమ్మన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

గోపాల్‌పేట, మే 7: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో పార్టీశ్రేణులు కరపత్రాలతో ఇంటింటి ప్రచారం చేశారు. గోపాల్‌పేట మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచారంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాలరాజు, కోఆప్షన్ సభ్యుడు ఎండీ మతీన్, నాయకులు కాశీనాథ్, సత్యనారాయణ, వెంకటయ్య, రాజు, లక్ష్మీనారాయణ, కర్రెన్న, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

### భారీ మెజార్టీతో గెలిపించాలి

ఆత్మకూరు, మే 7: ప్రజలకు అందుబాటులో ఉండే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దత్తుగా కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. మంగళవారం మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లోనూ ఆయా వార్డుల ఇన్‌చార్జిలు ముమ్మరంగా ప్రచారం చేశారు. పార్టీ అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ నేతృత్వంలో నిర్వహించిన ప్రచారాలలో నాయకులు మాట్లాడారు. ప్రజా సమస్యలున పరిష్కరించే, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిని గెలిపించుకోవాలిని కోరారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమాల్లో ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి

పెబ్బేరు, మే 7: హామీలను అమలు చేయలేని కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎంలను చూపుతూ కారు గుర్తుకు ఓటేసి, ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

### ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకుందాం

చిన్నంబావి, మే 7: బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రావమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నదగడలో ఉపాధి కూలీలను కలిసి బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని కూలీలను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు, ఉపాధి కూలీలు ఉన్నారు.



గోపాల్‌పేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



అయిజ పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



అమరవాయిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి



మాన్‌దొడ్డిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఎన్నికల విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

- జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, మే 7: పార్లమెంట్ ఎన్నికల విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా ఎన్నికల అధికారి సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో పీవో, ఏపీవో, వోపీవోల శిక్షణ తరగతులకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సమర్థవంతంగా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ ముందురోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రిని సకాలంలో తీసుకెళ్లాలన్నారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలింగ్ రోజు ఉదయం 5:30గంటలకు అన్ని రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ ప్రారంభించాలన్నారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభించాలని అధికారులకు సూచించారు. సమయపాలనతో అన్ని పనులు సకాలంలో పూర్తి చేసుకుంటూ రెండు గంటలకోసారి ఓటింగ్ సరళిని అధికారులకు తెలియజేయాలన్నారు. ఈవీఎంల పనితీరులో ఏవైనా సమస్యలు ఉంటే సెక్టోరియల్ అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ప్రతి ఓటరుకు టోకెన్‌లు అందజేసి గేట్ మూసివేయాలని ఆదేశించారు. టోకెన్లు జారీ చేసిన వారందరూ ఓటుహక్కు వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తైన తర్వాత ఎన్నికల సామగ్రిని నాగర్‌కర్నూల్‌కు తరలించి భద్రపర్చాలన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ మాట్లాడుతూ.. పీవో, ఏపీవో, వోపీవోలు, ఈవీఎంలపై ఎన్నికలకు సంబంధించిన 17–సీ ఫారం పీవో డైరీ తదితర అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు నర్సింగరావు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

## పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

గద్వాల, మే 7: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు వీలుగా జిల్లా కేంద్రంలోని పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్, ఓటర్ల రిజిస్ట్రేషన్‌లు తనిఖీ చేశారు. ఓటింగ్ సరళి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పరిశీలించారు. ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ఓటర్ హెల్ప్‌లైన్ కౌంటర్ వద్దనే ఓటరు జాబితాలోని క్రమ సంఖ్య, పార్ట్ నెంబర్‌ను చెక్ చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట తాసీల్దార్ జ్యోతి పాల్గొన్నారు.

### ఓటు హక్కును వినియోగించుకోవాలి

: ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి నగేశ్

వనపర్తి, మే 7: పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఉద్యోగి మే 8వ తేదీ సాయంత్రం 5గంటలలోగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి నగేశ్ సోమవారం ప్రకటనలో కోరారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం ఇదివరకే ఫారం–12 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు 8వ తేదీ మంగళవారం సాయంత్రం 5గంటలలోగా ఓటు హక్కును ఐడీవోసీలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో వినియోగించుకోవాలన్నారు. ఇందుకు సంబంధిత ఉద్యోగికి ఒక రోజు ప్రత్యేక సెలవు కూడా ఇచ్చినట్లు తెలిపారు.

### మన్యం వీరుడు అల్లూరి

వనపర్తి టౌన్, మే 7: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు, విప్లవ వీర కిరీటం అల్లూరి సీతారామరాజు అని ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటీష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన వీరుడని కొనియాడారు. కార్యక్రమంలో ఉద్యోగ, ప్రజా సంఘాల నేతలు గిరిరాజాచారి, నర్సింహశర్మ, దేవన్ననాయుడు, నాగరాజు, బాలస్వామి నాయుడు, పరమేశ్వరాచారి, మురళీధరాచారి, సత్యంచారి, మాధవాచారి, రమేశ్‌చారి, వేణుచారి, వెంకటేశ్, రాములు ఉన్నారు.

### పిడుగుపాటుతో 48గొర్రెలు మృతి

పెద్దమందడి, మే 7: మండలంలోని అల్వాలకు చెందిన గొల్ల బుడ్డన్న, గొల్ల టంకరి రమేశ్ గొర్రెలమందపై సోమవారం రాత్రి పిడుగుపడి 48 గొర్రెలు మృతిచెందాయి. విషయం తెలుసుకున్న ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆదిత్య రెడ్డి గ్రామానికి చేరుకొని మృతిచెందిన గొర్రెలను పరిశీలించి కాపరులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని, మనోధైర్యాన్ని కల్పించారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బాధితులకు గొర్రెలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని చిన్నారెడ్డి చెప్పారు. అదే విధంగా కలెక్టర్‌కు ఫోన్ చేసి జరిగిన నష్టం గురించి వివరించారు. పరామర్శించిన వారిలో కన్స్యూమర్ ఫోరం కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మండలాధ్యక్షుడు పెంటన్నయాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సత్యారెడ్డి తదితరులు ఉన్నారు.

### ప్రతిభా విద్యార్థులకు సన్మానం

వనపర్తి టౌన్, మే 7: పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్ రామాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాయీ బ్రాహ్మణ సంఘం సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి వినయ్‌కుమార్ హాజరై వినయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రమేశ్‌తో కలిసి విద్యార్థులను శాలువా, మెమెంటోలతో సన్మానించారు.

### పరీక్షలు తప్పనిసరి నిర్వహించాలి

గద్వాలటౌన్, మే 7: ముప్పై ఏండ్లు నిండిన ప్రతిఒక్కరికీ రోగ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి నిర్వహించాలని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు సూచించారు. జిల్లా కేంద్రంలోని బస్తీదవాఖానలో మంగళవారం గట్టు, ధరూర్ పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులు, ఆరోగ్యకార్యకర్తలతో ఎన్సీడీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయాలన్నారు. వ్యాధిగ్రస్తుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. సమావేశంలో ఎన్సీడీ కోఆర్డినేటర్ శ్యామ్‌సుందర్, మక్బూద్, సీహెచ్‌వో ఆనందయ్య, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌కు ఓట్లడిగే హక్కులేదు

- జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్



ముమ్మళ్లపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట, మే 7: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని ముమ్మళ్లపల్లి, అప్పరాలలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు కాంగ్రెస్ కష్టాలు తెచ్చిపెట్టిందని, వారి పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో లేరన్నారు. వారు దోచుకోవడానికే తప్పా మేలు చేసిన పాపాన పోలేదన్నారు. అలాగే కానాయపల్లి లో ఎంపీపీ గుంత మౌనిక, పట్టణంలో మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్ ప్రచారం చేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ చెన్న కేశవరెడ్డి, ప్రశాంత్, వడ్డె శ్రీనివాసులు, బాబురెడ్డి, అయ్యన్న, రాములుయాదవ్, రవీందర్‌రెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ నాయకుల ప్రచారం

మల్దకల్, మే 7: మండల కేంద్రంతోపాటు కుర్తిరావుల చెర్వు, విఠలాపురం, పెద్దొడ్డిలో మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుడు పాల్వాయి రాముడు ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, శివారెడ్డి, కృష్ణారెడ్డి, దర్శెల్లి, కార్యకర్తలు పాల్గొన్నారు.